క్లుప్తంగా

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి శశికాంత్

జి.మాడుగుల: మండంలోని గాంధీనగరం, కొక్కిరాపల్లి, నుర్మతి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులకు హెచ్‌బీ పరీక్షలు చేశారు. డీవార్మింగ్ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎంపీహెచ్‌ఈవో ఎస్.ప్రకాష్, పీహెచ్ఎన్ గౌరి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పాస్టర్లకు రెయిన్‌కోట్లు పంపిణీ



రెయిన్‌కోట్లు అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ నతానియేలు మేరీ గ్రేస్

అనంతగిరి: మండలంలోని పినకోట గ్రామంలో ఫస్ట్ లవ్ గాస్పెల్ చర్చిలో మదర్ చారిటిబుల్ ట్రస్ట్ చైర్మన్ పాస్టర్ నతానియేలు మేరీ గ్రేస్ ఆర్థిక సహాయంతో పాస్టర్లు, ఐటీడీఏ సూపర్‌వైజర్లకు గురువారం రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో గిరిజన ప్రాంతంలో సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని గ్రేస్ చెప్పారు. జి.సాల్మన్, జోసెఫ్, మింతుపాల్, సంతోష్‌కుమార్, పాస్టర్లు ఇమ్మానుయేలు, దావీదు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన



సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కొయ్యూరు: మండలంలోని కాకరపాడులో జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తొలగించనున్న అల్లూరి విగ్రహాన్ని గతంలో యూకో బ్యాంకు భవనం ప్రాంగణంలో ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు తహసీల్దార్ తిరుమలరావు ఈ ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్థలం కేటాయింపుపై కలెక్టర్‌కు నివేదించామన్నారు. అనుమతి రాగానే అల్లూరి విగ్రహం ఏర్పాటు పనులు చేయిస్తామన్నారు. దీనిపై అల్లూరి యువజన సంఘం ప్రతినిధులు శ్యామల వరలక్ష్మి, వీరభద్రరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

21న మండల సమావేశం

ముంచంగిపుట్టు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 21న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఆర్.వి.ఎస్.రమేష్ తెలిపారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో సమావేశం ఉదయం 11 గంటలకు జరుగుతుందని, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరు కావాలన్నారు.అన్ని శాఖాల మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో విధిగా హాజరు కావాలని, గైరాజరైతే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు.

క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతికి కృషి



జాన్ వెస్లీను సన్మానిస్తున్న పాస్టర్లు

రాజవొమ్మంగి: రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కుండా జాన్ వెస్లీను మండల పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. స్థానిక సీహెచ్ జకర్యా మందిరంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయనను దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. జిల్లా అసోసియేషన్ ఫౌండర్ స్టీఫెన్, ప్రెసిడెంట్ తిమోతి, సభ్యులు మణికుమార్, చంద్రపాల్, కృపారత్నం, గంగాధర్, సత్యానందం, బాబూరావు, అబ్రహాం, జకర్యా, ప్రసాద్, శోభన్‌బాబు పాల్గొన్నారు.

రైతుకు రక్ష ఈ-క్రాప్

- జోరుగా నమోదు ప్రక్రియ
- నూరుశాతం పూర్తి చేసేందుకు కృషి



పాత భల్లుగుడలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది

అరకులోయటౌన్: ఈ-క్రాప్ నమోదుతో ప్రభుత్వం రైతుకు అడుగడుగునా అండగా నిలుస్తోంది. ఇప్పటికే గిరిజన ప్రాంతంలో రైతు భరోసా (ఆర్‌బీకే)లు ఏర్పాటు చేసి విత్తనం మొదలుకొని చేతికొచ్చిన పంట కొనుగోలు వరకు అన్ని రకాల సేవలందిస్తోంది. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలనే లక్ష్యంతో ఈ-క్రాప్ ఆరంభించింది. పథకాల అమలులో పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా రైతులు ఏఏ పంటలు సాగు చేశారు, ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలను వ్యవసాయ అధికారులు ఈ-క్రాప్‌లో నమోదు చేస్తున్నారు. పంటల నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. శతశాతం పంట నమోదు కార్యక్రమం లక్ష్యంగా అధికారులు పని చేస్తున్నారు.

సబ్ డివిజన్‌లో పంటల సాగు వివరాలు

అరకులోయ వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల్లోని 81 సచివాలయాల పరిధిలో 42 రైతు భరోసా కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 39 వేల హెక్టార్ల సాధారణ సాగు భూమి ఉంది. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు 27,785 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో వరి- 16వేల హెక్టార్లల్లో , రాగులు- 9,300 హెక్టార్లు, కందులు-50 హెక్టార్లు , వేరుశనగ- 550 హెక్టార్లు, సాములు-వెయ్యి హెక్టార్లు, అల్లం-500 హెక్టార్లలో, మిరప- 35 హెక్టార్లు, బెండ, టమాటా, ఇతర కూరగాయలు, మరో 350 హెక్టార్లలో ఇతర రకాల పంటలు సాగులో ఉంది.

క్షేత్రస్థాయిలో పరిశీలన

అరకులోయ, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో గిరిరైతులు హార్టీకల్చర్ కింద మామిడి, జీడిమామిడి, పసుపు, మిరియాలు, సుగంధ ద్రవ్యాలు, నిమ్మ, అరటితో పాటు వివిధ రకాల పండ్ల తోటలు కలిపి 53,181 ఎకరాల్లో సాగులో ఉండగా, సుమారు 100 ఎకరాల్లో అన్ని రకాల కూరగాయలు సాగులో ఉన్నట్టు హార్టీకల్చర్ పీహెచ్‌ఓ అశోక్ తెలిపారు. ఇందులో భాగంగా పంటల సాగు వివరాలను రైతు భరోసా కేంద్రం అసిస్టెంట్‌లు నేరుగా రైతుల పొలం వద్దకే వెళ్లి ఈ - క్రాప్‌లో నమోదు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులు, పంట ఫొటోను తీసి, పూర్తి వివరాలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

రైతులకు అవగాహన

పంట ఈ -క్రాప్ నమోదు ప్రక్రియ వేగంగా జరుగుతుంది. అన్ని రైతు భరోసా కేంద్రల ద్వారా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు ఈ-పంట నమోదు ప్రక్రియను ప్రారంభించారు. పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ-క్రాప్ నమోదు కోసం రైతులు బ్యాంక్ ఖాతా, ఆధార్, ఫోన్ నంబర్లు, భూమి సంభందించిన వివరాలు అందజేయాలని తెలియజేస్తున్నారు. వీఏఏలు (విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు) ఆధార్ బేస్ డేటాను అనుసంధానం చేసి ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియను సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. నిర్ణీత సమయానికి నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశాలిచ్చినట్లు వీఏఏలు తెలిపారు. ఈ- క్రాప్ నమోదు చేసుకోవడంతో పంట నమోదు వల్ల వరదలు, తుపాన్లు సంభవిస్తే నష్టపోయిన పంటలకు ప్రభుత్వ ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీకి పంట రుణాలు, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, ఆర్‌బీకేల్లో పంటల ఉత్పత్తుల విక్రయించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ ప్రయోజనాలకు అర్హత



రైతులందరూ ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటే ప్రభుత్వ ప్రయోజనాలకు అర్హత లభిస్తుంది. పంట నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. దీని వల్ల కలిగే ప్రయోజనాలను రైతులు గుర్తించాలి. విధిగా పంట నమోదును చేయించుకోవాలి. వరదలు, తుపాన్లు వచ్చి పంట నష్టపోయిన సమయంలో ఈ-క్రాప్ చేయించుకొని ఉంటే ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుంది. ఇతర ప్రభుత్వ పథకాలకు ఇది ఉపయోగకరం.

– వంగవీటి మోహన్‌రావు, ఏడీ, వ్యవసాయశాఖ, అరకులోయ

రైతులకు ఎంతో మేలు

ప్రభుత్వం అమలుచేస్తున్న ఈ-క్రాప్ ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ- క్రాప్ నమోదుతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు నష్టపోయిన పంటలకు పరిహారం, సున్నా వడ్డీకు రుణాలు, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం అందజేయడం హర్షణీయం. మా లాంటి రైతులకు ఈ-క్రాప్ రక్షగా నిలుస్తుంది.

-కురిడి బుద్దు, రైతు, మాడగడ, అరకులోయ మండలం

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



జి.మాడుగుల కళాశాలలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అధ్యాపకులు



జగనన్నకు అభినందనలు తెలియజేస్తున్న అధ్యాపకులు

జి.మాడుగుల: కాంట్రాక్టు వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు రెగ్యులర్ చేస్తానని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు ఎల్.వెంకటరమణదొర, బుల్లిబాబు హర్షం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్‌ను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందన్నారు. నానా అవస్థలు పడ్డామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడం హర్షణీయమన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన దేవుడిగా సీఎం జగన్ తమ గుండెల్లో చిరస్థాయిగా ఉంటారన్నారు. జీవితాంతం జగన్ ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని కాంట్రాక్ట్ అధ్యాపకులు చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న తమకు రెగ్యులరైజ్ చేస్తూ తీసుకున్న నిర్ణయం మా కుటుంబాల్లో వెలుగు నింపిందన్నారు. ఈ సందర్భంగా సీలేరు జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. జగనన్న ప్రభుత్వం తమకు అండగా నిలిచిందని ఆనందం వ్యక్తం చేశారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



వ్యాపారులు, సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

అడ్డతీగల: మండల పరిషత్ కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణపై గ్రామ సచివాలయం సిబ్బంది, స్థానిక వ్యాపారులతో ఎంపీడీవో కె.బాపన్నదొర గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశుధ్యం నిర్వహణలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. వ్యర్థాలను డస్ట్‌బిన్‌లు, డంపింగ్‌యార్డులో పడవేయడం గాని లేనిపక్షంలో పంచాయతీ స్వీపర్లకు అందజేయాలని సూచించారు. మరుగునీరు రోడ్లపై విడవకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని సూచించారు. డ్రైనేజీల్లో పూడిక పనులు చేయిస్తామన్నారు. ఈవోపీఆర్డీ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



అన్నదానంలో భక్తులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. ఆలయంలో సాయిబాబాకు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం దూసరపాము గ్రామానికి చెందిన భక్తులు మత్సుర్తి సత్యనారాయణ మూర్తి, కృష్ణవేణి దంపతుల విరాళంతో అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించిన ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు.

క్రీడల్లో డీఏవీ విద్యార్థి ప్రతిభ



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న అధికారులు

సీలేరు : ఏపీ జెన్‌కో సీలేరు డీఏవీ పాఠశాల విద్యార్థి క్రీడల్లో ప్రతిభను సాధించాడు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థిని అబినందించారు.ఇటీవల అరకు ఏపీటీడబ్ల్యూఆర్ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి నిర్వహించిన క్రీడల్లో 300 మంది విద్యార్థులు హాజరుకాగా డీఏవీ పాఠశాల నుంచి కె.దుర్గా దారేష్ ,బి.మణికంఠ పాల్గొన్నారు. ఇందులో దుర్గా దారేష్ రెండు రౌండ్లు పూర్తి చేసుకొని ఏడవ ర్యాంకు సాధించి క్రీడా పాఠశాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు కోచ్ కమలాకర్, విద్యార్థి దారేష్‌ను జెన్‌కో సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రశాంత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ రామచంద్రరావు తదితరులు అభినందించారు.

ఎమ్మెల్యే పరామర్శ

అరకులోయటౌన్: డుంబ్రిగుడ ఎంపీపీ బాక ఈశ్వరి భర్త సింహాచలం అనారోగ్యంతో బాధపడుతూ అరకులోయ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మండల పార్టీ కొర్రా గాసి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, ఎంపీటీసీ భీమరాజు, సర్పంచ్ నాగేశ్వరరావు, టెలికం ఎడ్వైజరీ కమిటీ సభ్యుడు వెంకటరావు, పార్టీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు కిరణ్, కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులున్నారు.

నేడు ఆదివాసీ మత్స్యకారుల ధర్నా

అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ మెట్టపాలెం గ్రామంలో పీవీటీసీ ఆదివాసీలు తాటిపూడి జలాశయంలో గురువారం ఆందోళన చేశారు. ఐటీడీఏ తరపున తమకు బోట్లు, వలలు తదితర సామగ్రి అందడం లేదని, తాటిపూడి జలాశయం వల్ల భూములు కోల్పోవడం వల్ల చేపల వేటనే జీవనం చేసుకొని బతుకును సాగిస్తున్నామని, ఐటీడీఏ పీవో స్పందించి తమను ఆదుకోవాలని కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఐటీడీఏ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆదివాసీ మత్స్యకారులు శోభ మధు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు

అరకులోయటౌన్: అరకులోయ ఐసీడీఎస్ పరిధిలోని అరకులోయ-2, తుంగగెడ్డ అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీడీపీఓ శారద ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయనున్న అభ్యర్థులు వయస్సు 21 సంవత్సరముల నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలని, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులుగా పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 18 నుంచి 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా పూర్తి చేసిన దరఖాస్తులను స్థానిక సీడీపీఓ కార్యాలయంలో నేరుగా గానీ, పోస్టు ద్వారా గాని పంపించాలని సూచించారు.

ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం



అరకులోయ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెల అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు



ముంచంగిపుట్టులో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు

అరకులోయటౌన్/జి.మాడుగుల/ముంచంగిపుట్టు: అరకులోయ, జి.మాడుగుల, ముంచంగిపుట్టు ప్రాంతాల్లో ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు అరకులోయ, జి.మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. ముంచంగిపుట్టులో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. నాయకులు వెంకటేశ్వరరావు, రవి, హరిబాబు, వెంకటరమణ, అరుణ్‌కుమార్, సురేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం



చింతపల్లిలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాలయ్య



సీలేరులో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చింతపల్లి: ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆయన గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు తెలిసినప్పటికీ విపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణల నేపథ్యంలో పథకాల అమలుకు సంబంధించి పారదర్శకతపై ప్రజల్లో బలమైన అవగాహన కల్పించాలన్నారు. వలంటీర్ వ్యవస్థ వలన అన్ని వర్గాల ప్రజలకు పథకాలు ఇళ్ల వద్దకే చేరుతుండడాన్ని చూసి ఓర్వలేని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వలంటీర్లను ద్రోహులుగా విమర్శించడం దారుణమన్నారు. విపక్షాల విమర్శలను తిప్పికొట్టేందుకు ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉండాలని కోరారు. వైస్ ఎంపీపీ వెంగలయ్య, మండల కన్వీనర్ గణబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం మానుకోవాలి

సీలేరు : సీలేరు మేజర్ పంచాయతీపై టీడీపీ, బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం మానుకోవాలని ఎంపీపీ కుమారి, దావనాపల్లి సర్పంచ్ రామకృష్ణ చెప్పారు. సీలేరులో వారు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీలేరులో సర్పంచ్ ఉప ఎన్నికలో కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్న ఆయా పార్టీలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.టీడీపీ హయాంలో అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆర్వీనగర్ నుంచి సీలేరు వరకు రహదారి అభివృద్ధి చెందక పోవడానికి కారణం టిడిపి ప్రభుత్వమేనని ,అది తెలుసుకోవాలని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మన్య ప్రాంతంలో అన్ని గ్రామాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలుచేశారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధుల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులకు లక్షలాది రూపాయలు మంజూరు చేసిందని, ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీటి సరఫరా చేస్తోందన్నారు. జగనన్న ప్రభుత్వంపై ప్రజల నుంచి ఆదరణ చూసి ఓర్వలేక టీడీపీ, బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.నాయకులు సాంబమూర్తి, వెంకటరావు, గణేష్ , బుజ్జి ,శివరాం, అంజి, కమలమ్మ , బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అజొల్లాతో బహుళ ప్రయోజనాలు



అజొల్లాను వరి పొలంలో వేస్తున్న సిబ్బంది

రంపచోడవరం: వరి పొలాల్లో అజొల్లా వేయడంతో రైతులకు బహుళ ప్రయోజనం చేకూరుతుందని ఏపీ సీఎన్ఎఫ్ రీజనల్ అధికారి హేమసుందర్ చెప్పారు. మండలంలోని రంపఎర్రపాలెం, పెదగెద్దాడ తదితర ప్రాంతాల్లో వరి పొలాల్లో అజొల్లా బ్లాక్‌లను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పొలాల్లో అజోల్లా వేయడం ద్వారా కలుపు నివారణ చేయవచ్చన్నారు. పశువులకు ఈ మేత బలవర్ధకమైన ఆహారంగా ఉపయోగపడుతుందన్నారు. తద్వారా పశువులు పాలు ఎక్కువగా ఇస్తాయన్నారు. సిబ్బంది ప్రకాశ్, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని కోరాపల్లి పంచాయతీ కేంద్రంలో వరి మడుల్లో అజొల్లా సాగుపై ప్రకృతి వ్యవసాయ విభాగం రైతు సాధికార సంస్థ ఎం.నిట్టాపుట్టు యూనిట్ ఇన్‌చార్జి ఎం.ప్రసాద్ రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అజోల్లాను పొలంలో వేయడంతో ఎటువంటి రసాయన ఎరువులు వాడనవసరం లేదన్నారు. వెంకట్, పాపారావు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలోని ఏబులంలో ఆర్‌బీకే ఇన్‌చార్జి సంగీత ఆధ్వర్యంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి సాగులో గిరిజనులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 14 వారాల పాటు తగిన నాణ్యత చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించ వచ్చన్నారు. మోతాదుకు మించి ఎరువులు, పురుగుల మందు వినియోగించొద్దని సూచించారు. ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాల్గుణ ఔదార్యం



విద్యార్థికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ, నాయకులు

అరకులోయ టౌన్: ఉన్నత చదువుకు ఎంపికైన గిరిజన విద్యార్థికి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆర్థిక సహాయం అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని శరభగుడ గ్రామానికి చెందిన కొర్రా కుమార్ కుమారుడు కొర్రా అవినాష్ కుమార్ హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పూర్‌లో బీటెక్, ఎంటెక్ డ్యూయల్ డిగ్రీకి సంబంధించి సీటు సంపాదించాడు. ఆర్థికంగా వెనుక బడిన కుటుంబం కావడంతో పార్టీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే పాల్గుణ విద్యార్థి కుటుంబానికి రూ.8వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. బాగా చదవి తల్లిదండ్రులతోపాటు ఈ ప్రాంతానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పార్టీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు కిరణ్, మండల పార్టీ అధ్యక్షుడు గాసి, మార్కెట్ కమిటి చైర్మన్ రాజారమేష్, ఎంపీటీసీ ఎల్.బి. భీమరాజు, సర్పంచ్ నాగేశ్వరరావు, టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీటీసీ శెట్టి వెంకటరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రమేష్, కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు సాంభ, యాసీన్, బాలరాజు, నర్సింగ్, రామారావు, అర్జున్, సాంరు, కో- ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్ విజేతలకు అభినందన



జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో పతకాలు పొందిన విద్యార్థులతో స్కూల్ సిబ్బంది

కొంకోట: అంతర్ యూనిక్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ రూపనంది గురువారం తెలిపారు. అనకాపల్లిలో ఇటీవల జరిగిన ఈ పోటీల్లో పాల్గొన్న తమ స్కూల్ నుంచి 24 మంది విద్యార్థులు పతకాలు గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. ఐదుగురు బంగారు, 11 మంది వెండి, 8 మంది కాంస్య పతకాలను పొందినట్లు తెలిపారు. విజేతలను ఆమెతోపాటు అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఉపాధ్యాయులు అభినందించారు.